క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

రామచంద్రపురం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒక వ్యక్తికి జైలు శిక్ష పడినట్లు రామచంద్రపురం ఎస్ఐ డి.సురేష్‌బాబు మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. పట్టణంలోని రాజబాబూనగర్‌కు చెందిన విజయశేఖర్ మద్యం సేవించి నిర్లక్ష్యంగా మోటారు సైకిల్ నడుపుతుండగా ఎస్ఐ సురేష్‌బాబు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరచగా ఏజేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ ఆర్.ఆశీర్వాదంపాల్ నిందితుడికి 15 రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

వెల్లలో పొలంబడి కార్యక్రమం

రామచంద్రపురం రూరల్: వెల్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎరువుల యాజమాన్యం, చలి వాతావరణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ పి.సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ద్వారపూడి రోడ్డు పనులు వేగవంతం చేయాలి

మండపేట: ద్వారపూడి రోడ్డు పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన ద్వారపూడి రోడ్డు పనులపై ఆర్అండ్‌బీ డీఈ వైవీ రావు, జేఈ సూర్యనారాయణలతో సమీక్షించారు. ప్రయాణికుల ఇబ్బందులు దృష్ట్యా పనుల వేగం పెంచాలని సూచించారు.

హుండీ ఆదాయం రూ.1.64 లక్షలు

మండపేట: గడిచిన మూడు నెలలకు గాను మండలంలోని కేశవరంలో వేంచేసియున్న గని పోతురాజు స్వామివారి హుండీ ఆదాయం రూ.1,64,787 వచ్చింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో ఈఓ అన్నందేవుల శ్రీనివాస్, ఆలయ సిబ్బంది హుండీని లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ కూసి వీరవెంకట నరసింహమూర్తి, సభ్యులు పురంశెట్టి శ్రీనివాస్, కొక్కిరి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం



అంగర వేణుగోపాలస్వామి ఆలయంలో పూజ చేస్తున్న అర్చకులు

కపిలేశ్వరపురం: అంగరలోని వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం లక్ష తులసి పూజ, సుదర్శన హోమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి భార్గవ, మురళీకృష్ణమాచార్యుల పర్యవేక్షణలో వేద పండితులు స్వామిని విశేషంగా అలంకరించారు. స్వామి మహిమల ప్రత్యేకతలను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కట్టా రామచంద్రరావు, ఈఓ రామలింగం, భక్తులు పాల్గొన్నారు.

కన్వీనర్ల మండల అధ్యక్షుడిగా నాగేంద్రప్రసాద్

కాజులూరు: వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడిగా కుయ్యేరుకు చెందిన చింతపల్లి నాగేంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కుయ్యేరు గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి నాగేంద్రప్రసాద్‌ను స్థానిక నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం



అంగరలో ఫెలోషిప్ సమావేశంలో చర్చిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: అంగరలోని కలిగినీడి ఏసురత్నం చర్చిలో బుధవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఫెలోషిప్ అధ్యక్షుడు జి.రూబెన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చర్చిల నిర్వహణ, ప్రపంచ శాంతి ప్రార్థన కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు కె.ఏసురత్నం, ఉపాధ్యక్షుడు ఎం.డేవిడ్‌రాజు, కార్యదర్శి కిరణ్‌పాల్, కోశాధికారి ఇమ్మానుయేల్, నానిబాబు, ప్రసాద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అలరించిన బుర్రకథ

కాజులూరు: కుయ్యేరులో బుధవారం గెయిల్ ఇండియా అధికారులు నిర్వహించిన బుర్రకథ స్థానికులను అలరించింది. రామచంద్రపురానికి చెందిన గొర్రెల రాము, కృష్ణ సోదరుల బృందం గెయిల్ ఇండియా సహజ వాయువుల పైపులైను, వాటి రక్షణ కోసం ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను బుర్రకథ ద్వారా వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణమూర్తి, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం సుశీలమణి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

- ఆకట్టుకున్న ముందస్తు సంక్రాంతి సంబరాలు
- సంప్రదాయ నృత్యాలతో చిన్నారుల సందడి



పసలపూడి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

రాయవరం: సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని మండలంలోని పసలపూడి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి పేర్కొన్నారు. పాఠశాలలో బుధవారం రామారెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భోగిమంటను వెలిగించి దాని చుట్టూ ఉపాధ్యాయులు, విద్యార్థులు సంక్రాంతి పాటలకు అనుగుణంగా నర్తించి అలరించారు. రాయవరం సాయితేజ విద్యానికేతన్‌లో అకడమిక్ డైరెక్టర్ తేతలి భానురేఖ ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. హరిదాసులు, డూడూ బసవన్నలు, భోగిమంటలు, చిన్నారులకు భోగిపళ్లు పోసి సంప్రదాయానికి వన్నెతెచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రంగవల్లులు వేసి అలరించారు.

కె.గంగవరం: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. హెచ్‌యం పితాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పామర్రు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. బొమ్మల కొలువు, హరిదాసు వేషధారణ, కోలాటం తదితర కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు సందడి చేశారు. రంగు, రంగుల ముగ్గులు వాటి మధ్య గొబ్బెమ్మలు పెట్టి విద్యార్థినులు నృత్యాలు చేశారు.

కాజులూరు: ఒంటితాడి, ఒంటితాడి శివారు శీలలంక గ్రామాల్లో మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. సంక్రాంతి పండగ వాతావరణం ఉట్టిపడేలా గొబ్బెమ్మలు పెట్టి, భోగిమంటలు వేసి దాని చుట్టూ జ్ఞానపద గేయాలు పాడుతూ నృత్యాలు చేశారు. పలువురు విద్యార్థులు పోటాపోటీగా ముగ్గులు పెట్టి ఆకట్టుకున్నారు. పోటీల్లో విజేతలకు గ్రామ సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ బహుమతులు అందజేశారు.

రామచంద్రపురం రూరల్: హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం గోర్స లక్ష్మి ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ వాతవరణం ప్రతిబింబించే సెట్టింగ్‌లతో సందడి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఎంపీ బోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. ద్రాక్షారామ సూర్య హైస్కూల్‌లో బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. లిటిల్ రోజ్ విద్యా సంస్థల ప్రాంగణంలో వేమగిరికి చెందిన సర్వరాయ బాటిలింగ్ యూనిట్(కోకాకోలా) ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సెయింట్ మేరీస్ చైతన్య హైస్కూల్ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

మండపేట: సంక్రాంతి పండగలు సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక 28వ వార్డు ఎస్‌వీఎస్‌ఆర్ మున్సిపల్ పాఠశాలలో జరిగిన వేడుకలను కౌన్సిలర్ మొండి భవాని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, ఎంఈఓ ఎస్ రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. మండపేట సంఘం కాలనీలోని ఎంపీపీ పాఠశాల, ద్వారపూడిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, తాపేశ్వరంలోని పోలిశెట్టి సత్తిరాజు, భూషణం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంప్రదాయ వస్త్ర ధారణ, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



అముజూరులో సంక్రాంతి సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు



ఒంటితాడి ప్రభుత్వ పాఠశాలలో వేసిన భోగి మంట



హరిదాసుకు బియ్యం వేస్తున్న రాయవరం సాయితేజ విద్యార్థులు

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు టెస్ట్‌పేపర్స్ అందజేస్తున్న ఎంఈఓ రామచంద్రరావు

మండపేట: దాతల తోడ్పాటును సద్వినియోగం చేసుకుని 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ ఎస్.రామచంద్రరావు అన్నారు. స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన 2015–16 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఎస్ఎస్‌సీ టెస్ట్ పేపర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సేవలను అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు శోభావళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఎంసీ సభ్యుడు యరమాటి వెంకన్నబాబు, పూర్వ విద్యార్థులు కేవీడీఎస్ గణేష్, కె.అఖిల్, ఎన్.శ్రీనివాస్, టి.రమేష్, వి.పురందేశ్వరి, యు.లలిత, గుణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్

రామచంద్రపురం: పట్టణంలోని వికాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో విద్యార్థులు స్వతహాగా ఆలోచించి తమ సృజనాత్మక శక్తితో వివిధ రకాల ఆకృతులను తయారు చేశారు. కాగితాలు, వివిధ రకాల వస్తువులతో చేసిన బొమ్మలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యా సంస్థల అధినేత వీవీ రమణ ప్రారంభించిన ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుపేదల జీవితాల్లో వెలుగులు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- కాపవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



కాపవరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కాపవరంలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. గుర్తించిన సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి మేరకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నెలకొని ఉన్న సమస్యలను గుర్తించి తక్షణం పరిష్కరించేందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం రూపొందించారన్నారు. సచివాలయాల ద్వారా గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. గ్రామ వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ రెడ్నం సతీష్, సొసైటీ చైర్మన్ గీసాల శివ, వార్డు సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సృజనోత్సవ్ వేడుకలు



విజ్ఞాన్‌లో సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థినిలు

మండపేట: పట్టణంలోని ఆలమూరు రోడ్డులో గల విజ్ఞాన్ కళాశాలలో సృజనోత్సవ్ వేడుకలు బుధవారం కళాశాల ప్రాంగణంలో అట్టహాసంగా జరిగాయి. కళాశాల డైరెక్టర్ యినపకోళ్ల గణేష్‌చౌదరి, ప్రిన్సిపాల్ బాబీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, పట్టణ సీఐ పి.శివగణేష్, ఐఎస్‌డీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు యినపకోళ్ల సత్యనారాయణ(ఐఎస్ఎన్)లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. 2022–23 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. సృజనోత్సవ్ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. అధ్యాపకులు ద్విభాష్యం నగేష్‌బాబు, శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే శాశ్వత భూరక్ష పథకం



భూయజమానులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: గ్రామాల్లో తరతరాలుగా ఉన్న భూవివాదాల శాశ్వత పరిష్కరించడానికే ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. పామర్రులో బుధవారం భూ యజమానులకు జగనన్న భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ వాసంశెట్టి సూరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో గ్రామీణ ప్రాంత భూయజమానులు తమ భూములను సర్వే చేయించుకోవాలంటే ఎన్నో వ్యయప్రయాసలకు గురి కావాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్ జగనన్న భూరక్ష పథకం ద్వారా గ్రామంలోని ప్రతి సర్వే నెంబర్‌ను ప్రభుత్వమే ఆధునిక సాంకేతికతతో సర్వే చేయిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వైద్యనాథశర్మ, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, వీఆర్‌ఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో సంకాంత్రి సంబరాలు

వందేళ్ల నాటి సీతారాముల వెండి పాదాల ప్రదర్శన



ఆలయ ప్రాంగణంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కాకినాడకు చెందిన శ్రీ సూర్య నృత్య నికేతన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. వందేళ్ల క్రితం టంగుటూరి ప్రకాశం పంతులు, ముమ్మిడి వెంకటరత్నంలు కలసి తయారు చేయించిన సీతారాముల వెండి పాదాలను ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు), ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో పాదాలను ఆలయం లోపలికి తీసుకొచ్చారు. అనంతరం ఆ పాదాలను మధ్యలో ఉంచి సుమారు 300 మంది చిన్నారులు గొబ్బిళ్ల పాటలు, కోలాటంతో పండగ వాతావరణం తెచ్చారు. కార్యక్రమంలో వేగాయ్మపేట జమీందార్ వాడ్రేవు సుందర రత్నాకర రావు, రామచంద్రపురం శివాలయం మాజీ చైర్మన్ నేదునూరి ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీరాంపురం వద్ద బస్సు బోల్తా

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర గ్రామ శివారు శ్రీరాంపురం వద్ద మండపేటలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన బస్సు బుధవారం బోల్తాపడింది. బస్సులోని ముగ్గురు విద్యార్థులు, డ్రైవర్ సురక్షితంగా బయటపడటంతో ప్రమాదం తప్పింది.

అఖిలపక్షాల ఆందోళన

రామచంద్రపురం: రామచంద్రపురం నుంచి ద్రాక్షారామ వెళ్లే రహదారిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. టీడీపీ ఇన్‌ఛార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ నాయకులు, సీపీఐఎంఎల్ వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. తొలుత రామచంద్రపురం నుంచి ద్రాక్షారామ వరకు పాదయాత్ర చేసేందుకు ప్రయత్నించారు. పాదయాత్రకు అనుమతి లేదని రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి నేతృత్వంలో పోలీసు అధికారులు ఆందోళన కారులను అడ్డుకున్నారు. దీంతో టీడీపీ ఇన్‌ఛార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం చేసేది లేక రామచంద్రపురం–ద్రాక్షారామ రోడ్డును వెంటనే నిర్మించాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు



ద్రాక్షారామలో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేసిన ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: సంక్రాంతి పండగ పురస్కరించుకుని ద్రాక్షారామలో విధులు నిర్వహిస్తున్న 25 మంది పారిశుధ్య, పంచాయతీ సిబ్బందికి బుధవారం పంచాయతీ పాలకవర్గం నూతన వస్త్రాలు, కొబ్బరి నూనె, సబ్బులు అందజేశారు. వైఎస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజులు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నున్న సత్యవతి, మండల కోఆప్షన్ సభ్యుడు అలీషా, పంచాయతీ కార్యదర్శులు వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, కోట వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.5 కోట్లతో పట్టణంలోని 11, 12 వార్డుల పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పరిశీలించారు. పనుల ప్రగతిని గురించి డీఈ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ గోతులతో ప్రమాదభరితంగా తయారైన ఇందిరాగాంధీ బైపాస్‌రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు కొవ్వాడ బేబీ, మలసాని సీతామహాలక్ష్మి, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ఏఈ సత్యనారాయణ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు మరింత మెరుగుపరచాలి



అంగర పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీలో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ఎంపీపీ సత్యవేణి అధ్యక్షతన నిర్వహించిన పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో పీహెచ్‌సీలో సేవల తీరుతెన్నులపై చర్చించారు. వైద్యాధికారి పి.రత్నకుమారి ఆసుపత్రి నిర్వహణపై మాట్లాడారు. ల్యాబ్‌రూం ఆధునికీకరణ, పరికరాలు కొనుగోలు, ఆర్‌ఓ ప్లాంట్, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం తదితర పనులకు తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశంలో సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, అడ్డాల శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, పి.సురేష్ పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఘనంగా చీర సారె

50 రకాల పిండి వంటలతో నైవేద్యం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మండపేట: ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం గోదాదేవి, కన్యకాపరమేశ్వరి అమ్మవార్లకు చీర సారె కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 50 రకాల పిండివంటలతో అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. గోదావేవి కల్యాణోత్సవాల్లో భాగంగా 250 మందికి పైగా ఆర్యవైశ్య మహిళలు పసుపు కుంకుమ, చీర సారె, పిండివంటలతో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఆర్యవైశ్య ప్రముఖులు గ్రంధి నమశ్శివాయ, సంకా వెంకట్రాజు, బలభద్ర వీరభద్రరావు, ప్రసాద్, గ్రంధి రంగా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసి పూజ



లక్ష రుద్రాక్షలకు పూజాధికాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులు

రాయవరం: నదురుబాదలో బుధవారం లక్షతులసి, లక్షపత్రి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సతీసమేతంగా పూజల్లో పాల్గొన్నారు. స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి లక్ష తులసి, పార్వతీ సమేత మల్లేశ్వరస్వామికి లక్ష పత్రి పూజను ధనుర్మాసం సందర్భంగా నిర్వహించారు. తొలుత స్వామికి విశ్వక్సేన పూజ, మండపారాధన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులచే స్వామికి నూతన వస్త్రాల సమర్పణ, లక్ష రుద్రాక్ష పూజలు నిర్వహించారు. పూజల్లో జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ సిరిపురపు శ్రీనివాసరావు, సత్యవతి దంపతులు, ఆలయ ఈవో అయ్యప్పరాజు, స్థానిక నేతలు వుండవిల్లి శ్రీనివాసచౌదరి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు పనులు



శరవేగంగా జరుగుతున్న రామచంద్రపురం–వెల్ల రహదారి పనులు

రామచంద్రపురం: రామచంద్రపురం–వెల్ల రోడ్డు మరమ్మతుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ వెల్ల రోడ్డు పనులను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ అధికారులు బుధవారం నుంచి రోడ్డు పనులు ప్రారంభించారు. దమ్ము ట్రాక్టర్లు రోడ్ల మీద నడపడం వల్ల కలిగే నష్టాన్ని రైతులకు వివరించాలని మంత్రి వేణు అధికారులను ఆదేశించారు.